ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వరంగల్ రూరల్
20
గురువారం 31, ఆగస్టు 2017

జిల్లా వార్షిక రుణప్రణాళిక రూ.1528.63 కోట్లు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌జీవన్ పాటిల్

20


- యూనిట్ల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలి
- బ్యాంకర్లు నిర్లక్ష్య ధోరణిని వీడాలి
- కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్
- 2017-18 వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ

బతుకమ్మ వేడుక
సర్కారు కానుక





పంపిణీ చేయనున్న బతుకమ్మ చీరలు



బతుకమ్మ చీరలను ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

- ఆడపడుచులకు బతుకమ్మ చీరలు
- జిల్లాలో 2,59,733 మహిళల గుర్తింపు
- తెల్ల రేషన్ కార్డుదారులకు 18వ తేదీ నుంచి పంపిణీ
- రేషన్ డీలర్లకు యూనిట్‌గా అందజేత
- మరింత ఉత్సాహంగా పండుగ సంబురం
- స్టాకును నిల్వ చేయడానికి ఇప్పటికే గోదాంల గుర్తింపు

2

ప్రభుత్వం ఆడపడుచులకు తీపి కబురందించింది. 18ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు బతుకమ్మ చీరలను అందించాలని నిర్ణయించింది. వచ్చే నెల 18వ తేదీ నుంచి 20వరకు ఈ పంపిణీ ప్రక్రియ చేపట్టనుంది. ఇందుకుగాను జిల్లాలో 2,59,733 మహిళలను ఇప్పటికే గుర్తించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికే వీటిని అందించనున్నారు. కాగా, చీరలను అందించడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాస్థాయిలో డీఆర్‌డీవో పీడీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా, మండలస్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను గుర్తించి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. చీరలను నిల్వచేయడానికి గోదాంలను కూడా ఇప్పటికే సిద్ధం చేశారు. దీంతో బతుకమ్మ సంబురం రెట్టింపుకానుంది.

-పర్వతగిరి/రాయపర్తి

గడువులోగా 'మిషన్ భగీరథ' పనులు

11

- జనవరి 1 నుంచి ప్రతీ ఆవాసానికి తాగునీరు అందించాలి
- మహబూబాబాద్ సెగ్మెంట్‌కు రీ షెడ్యూల్ ఇవ్వాలి
- వరంగల్ అర్బన్‌లో నత్తనడకన పనులు
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- అలసత్వం వహిస్తే నష్టపోయేది మనమే
- రేపటి నుంచి రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలి
- 10లోగా చెరువుల్లో చేప పిల్లలను వదలాలి
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- ఐదు జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

బతుకమ్మ వేడుక.. సర్కారు కానుక

■ పర్వతగిరి/రాయపర్తి

☞ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు ☞ వచ్చేనెల18వ తేదీ నుంచి పంపిణీ

ప్రభుత్వం ఆడపడుచులకు పండుగ వేళ తియ్యని కబురు అందించింది. రాష్ట్రంలో 18ఏళ్లు నిండి, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ మహిళకు బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చీరలను అందించాలని నిర్ణయించింది. చీరలను తయారుచేసే పనిని ఇప్పటికే నేతన్నలకు అందించగా తయారీని వేగవంతం చేశారు.

రాష్ట్రంలో 1,01,57,610 మంది ఉండగా, జిల్లాలో 2,59,733 మంది 18ఏళ్లు నిండిన మహిళలు ఉన్నారు. వీరందరికీ చీరలు పంపిణీ చేయడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాస్థాయిలో డీఆర్‌డీవో పీడీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా, మండలస్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను గుర్తించి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంటుంది.



నిల్వఉంచిన బతుకమ్మ చీరలు

రెండురకాల ప్రయోజనం..

క్రిస్మస్, రంజాన్ పండుగలకు గాను పేదవారిని గుర్తించి, వారికి ప్రభుత్వం దుస్తులను పంపిణీ చేస్తూ వస్తోంది. దీంతో రాష్ట్రంలో ఆడపడుచులకు అతిపెద్ద పూలపండుగ అయిన బతుకమ్మ పండుగకు నిధులను మాత్రమే విడుదల చేసేది. అలాకాకుండా తెలంగాణ ఆడపడుచులకు కూడా చీరలను పంపిణీ చేయాలని భావించి, సుమారు వంద రకాల డిజైన్లను తయారీ చేయిస్తున్నారు. దీంతో ఇటు నేత కార్మికులకు ఉపాధి కల్పించడమేగాకుండా, అటు మహిళలకు పండుగ సందర్భంగా దుస్తులను అందించనట్లు అవుతుందని భావించింది. దీంట్లో కేవలం హిందూ మహిళలకే కాకుండా ఇతర మతాలకు చెందిన మహిళలకు కూడా చీరలను అందించనున్నారు.

2,59,733 మంది మహిళలకు చీరలు..

జిల్లా వ్యాప్తంగా 18సంవత్సరాలు నిండి తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలు 2,59,733 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ రేషన్ దుకాణాల ద్వారా చీరలను పంపిణీ చేయడానికిగాను అధికార యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వం నుంచి వచ్చే చీరలను నిల్వచేసేందుకుగాను గిడ్డంగులను సైతం అధికారులు ఇప్పటికే గుర్తించారు.

రేషన్ డీలర్లకు బాధ్యతలు..

ముస్లిం, క్రైస్తవ కుటుంబాలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా మసీదులు, చర్చిల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కమిటీల సమక్షంలో పంపిణీ చేసేవారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో తెల్లరేషన్‌కార్డు ఉండి 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ చీరలను పంపిణీ చేయాలని భావించడంతో వాటి పంపిణీ బాధ్యతలను రేషన్ డీలర్లకు అందించారు. రేషన్‌షాపుల్లో ఉన్న తెల్లరేషన్ కార్డుదారుల ఆధారంగా చీరలను పంపిణీ చేయనున్నారు. దీంతో అర్హులకు అందుతాయని భావిస్తున్నారు.

మండలస్థాయిలో కసరత్తు..

చీరలను పంపిణీ చేయడానికి రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో కసరత్తు పూర్తికావడంతో ప్రస్తుతం మండలస్థాయిలో కసరత్తును చేపట్టారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక, చీరల పంపిణీ తదితర కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సమావేశాల్లో సూచనలు చేస్తున్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఎస్‌హెచ్‌జీ సంఘాలతో విలేజ్‌లెవల్ ఆర్గనైజేషన్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

మండలాల వారీగా చీరలు అందించే జాబితా

మండలం	సంఖ్య
ఆత్మకూరు	12,521
చెన్నారావుపేట	14,837
దామెర	12,543
దుగ్గొండి	16,692
గీసుగొండ	20,909
ఖానాపురం	11,656
నల్లబెల్లి	13,543
నర్సంపేట	26,005
నెక్కొండ	18,753
పరకాల	25,554
పర్వతగిరి	17,048
రాయపర్తి	20,037
సంగెం	17,467
శాయంపేట	15,227
వర్ధన్నపేట	16,941
మొత్తం	2,59,733

నిల్వ చేయడానికి గిడ్డంగుల గుర్తింపు..

బతుకమ్మ చీరలను నిల్వచేసేందుకు జిల్లాస్థాయిలో గిడ్డంగులను గుర్తించినట్లు ఇటీవల కలెక్టర్ సీఎస్ ఎస్పీ సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. జిల్లాకు బతుకమ్మ చీరలు వచ్చే నెల 15లోపే చేరే అవకాశాలున్నాయి. అనంతరం 17వరకు ఆయా మండలాల్లో గుర్తించిన గిడ్డంగులకు చీరలను సరఫరా చేస్తారు. కాగా, సెప్టెంబరు 18,19,20 తేదీల్లో మహిళలకు పంపిణీ చేయనున్నారు.

రెట్టింపుకానున్న పండుగ సంబరం..

మహిళల అతిపెద్ద పండుగైన బతుకమ్మ పండుగకు తెలంగాణ ప్రభుత్వం చీరలను పంపిణీ చేస్తుండడంతో ఆడ పడుచుల పండుగ సంబరం రెట్టింపు కానుంది. గత ప్రభుత్వాలు బతుకమ్మ పండుగ సందర్భంగా దుస్తులను పంపిణీ చేయలేదు సరికదా! కనీసం పండుగలను నిర్వహించ లేదు. తెలంగాణ వచ్చిన తరువాత ప్రభుత్వం పండుగ వేడుకలకు నిధులను విడుదల చేస్తోంది. ప్రస్తుతం ఏకంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపడుతుండడంతో.. ఆడపడుచుల ఆనందానికి అవధులు లేకుండాపోతున్నాయి. పండుగను మరింత సంతోషంతో జరుపుకుంటామని మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు.

పకడ్బందీగా పంపిణీకి చర్యలు..

శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ



మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేయడానికి పకడ్బందీ చర్యలు చేపట్టాం. జిల్లాలో అర్హులైన మహిళలను ఇప్పటికే గుర్తించి జాబితా రూపొందించాం. దీని ఆధారంగా పంపిణీ చేపడుతాం. ఇప్పటికే జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహించాం. మండలస్థాయిల్లో సైతం ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రతీ పేదమహిళకు చీరలు అందేలా చర్యలు చేపడుతాం.

కోటగండి- కొమ్మాల మధ్య కలెక్టరేట్‌ని ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొమురారెడ్డి

జిల్లా సాదన సమితి డిమాండ్

సంగెం: రూరల్ కలెక్టరేట్‌ని కోటగండి- కొమ్మాల గ్రామాల మధ్య ఏర్పాటు చేయాలని జిల్లా సాదన సమితి డిమాండ్ చేసింది. బుధవారం మండలంలోని పల్లార్‌గూడ, మొండ్రాయి తదితర గ్రామాల్లో సాధన సమితి సభ్యులు ప్రజల మద్దతు కోరుతూ పర్యటన జరిపారు.

ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ జిల్లా కేంద్రం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం ఈ ప్రాంత ప్రజలు ఉద్యమంలో భాగం పంచుకోవాలన్నారు. సెప్టెంబర్ 1న గీసుగొండ మండలంలో కోనాయమాకుల వద్ద రాస్తారోకోలో ప్రతీ ఒక్కరూ పాలుపంచుకోవాలని చెప్పారు.కార్యక్రమంలో చాడ కొమురరెడ్డి,తీగల రవీందర్‌గౌడ్,పత్తిపాక రవీందర్, సోమిడి శ్రీనివాస్, ఓదేల రాజయ్య, గోనే మాల్లారెడ్డి, యాకయ్య, పెండ్లి కుమారస్వామి, కద్దూరి సంపత్, చెవ్వ వీరమల్లు, అనుముల కుమారస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

‘బతుకమ్మ చీరల పంపిణీని విజయవంతం చేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

గీసుగొండ: బతుకమ్మ చీరల పంపిణీని అన్ని గ్రామాల్లో అర్హులందరికీ అందించి విజయవంతం చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సమీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ముంత కళావతి, జడ్పీటీసీ ఆంగోతు కవిత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో సుజప్‌తేజ, ఏపీఎం సురేష్, ఎంసీవో సురేష్, కార్యదర్శులు, వీఆర్వోలు, ఐకేపీ సీసీలు, ఎంబీకేలు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీపై సమీక్ష

పర్వతగిరి: బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పంపిణీ చేసే చీరలపై మండల ప్రత్యేకాధికారి పద్మ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చీరల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలన్నారు. అర్హులైన లబిదారులను గుర్తించి వారికే చీరలు అందేటట్లు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, మహిళా సంఘం అధ్యక్షురాలు కలిసి కమిటీలను వేసుకుని పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రి ఆర్‌ఎంవోకు మాతృవియోగం

నెక్కొండ : హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రి రీజనల్ మెడికల్ ఆఫీసర్(ఆర్‌ఎంవో) మహ్మద్ రఫీ తల్లి అఫ్జల్‌బీ(75) అనారోగ్యంతో బుధవారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి అఫ్జల్‌బీ మృతదేహాన్ని సందర్శించి,సానుభూతిని వ్యక్తం చేశారు. ఆవిడకి నలుగురు కుమార్తెలు, అఫీజ్‌పాష, యాకూబ్‌పాష, అప్సర్ ఉన్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ గటిక అజయ్‌కుమార్, జడ్పీకో-ఆప్షన్ సభ్యురాలు నుస్రత్‌తన్వీర్, వైస్ ఎంపీపీ సారంగపాణి, నాయకులు శివకుమార్, శ్రీకాంత్, యాకయ్య, వాగ్యానాయక్, లింగ్యానాయక్ ఉన్నారు.



మృతి చెందిన అఫ్జల్‌బీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది, ఎంపీపీ

విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన సీఈ

ఆత్మకూరు: పుట్టిన గ్రామంపై ఉన్న మామకారంతో గ్రామాభివృద్ధిలో విద్యుత్ శాఖలో అత్యున్నతమైన ఉద్యోగం చేస్తున్న పేరుమాండ్ల సత్యనారాయణగౌడ్ 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయడంతో పాటు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీడియల్ సీఈ సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ పెంచికలపేట గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహాయం చేస్తున్నానన్నారు. విద్యుత్ శాఖలో ఉన్నతమైన పదవిలో ఉండి గ్రామంలో విద్యుత్ సమస్య ఉండకుండా రూ. కోటి 25 లక్షల ఖర్చుతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించానన్నారు.కార్యక్రమంలో ఎస్పీడియల్ డైరక్టర్ నర్సింహారావు, సీజీఎం మోహన్‌రావు, టి. మధూసుధన్,కుసుమ రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కర్షకుల నేస్తం కేసీఆర్

నిరంతరం రైతుల కోసమే ఆలోచిస్తారు

రైతు కమిటీలు పారదర్శకంగా జరగాలి

ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు


టీఆర్ఎస్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దయాకర్‌రావు

రాయపర్తి : ముఖ్యమంత్రి కేసీఆర్ కర్షకుల నేస్తంగా, నిరంతరం పనిచేస్తున్నాడని, రైతుల కోసమే ఆలోచిస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాడని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు ప్రభుత్వం రైతు సంక్షేమ సంఘాల సమితిలు ఏర్పాటు చేయనుందని తెలిపారు. గ్రామంలో రెండెకరాలకు పైబడి పాసు పుస్తకం కలిగి ఉన్న రైతును కమిటీ సభ్యుడిగా ఎంపిక చేయాలని, అదేవిధంగా రిజర్వేషన్ ఆధారంగా కూడా కమిటీ సభ్యులను నియమిస్తారని అన్నారు. దీని ద్వారా రైతుకు ఎకరాకు రూ. 4 వేలు అందించే కార్యక్రమం సులభతరమవుతుందని తెలిపారు. కమిటీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన రైతులను కమిటీలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసీఆర్ ఎంతో నిబద్ధతో రైతుల పక్షాన పనిచేస్తున్నాడని, అందులో భాగంగానే శ్రీరాం సాగర్ ప్రాజెక్టును పునర్జీవ పథకం పేరుతో ఎస్సారెస్పీ పోచంపాడు వద్ద శంకుస్థాపన చేశారన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జీనుగు అనిమిరెడ్డి, అభివృద్ధి అధ్యక్షుడు నర్సింహనాయక్, సర్పంచ్ ఉస్మాన్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్, శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ నయీం, ఆకుల సురేందర్‌రావు, రంగు కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, రవి, పాల్గొన్నారు.

రాయపర్తి మండల అభివృద్ధే లక్ష్యం....

రాయపర్తి మండల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని, అంతర్గత రోడ్ల కోసం కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు 100 మంది ఎర్రబెల్లి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

● తాళం వేసిన ఇండ్లే వారి టార్గెట్ ● ముగ్గురు నిందితులను అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న దృశ్యం

వరంగల్ అర్బన్ క్రైం: తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడే ముగ్గురు నిందితులను వరంగల్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 5.50 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వరంగల్ క్రైం ఏసీపీ పూజ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాల్‌పల్లి జిల్లా ఘన్‌పూర్ మండలానికి చెందిన నెరడిగొమ్ముల కిశోర్‌కుమార్, మంచిర్యాల రాళ్లపేటకు చెందిన చితారి శ్రీనివాస్ ఆలియాస్ వరికొప్పుల శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల గ్రామానికి చెందిన కంప నిరంజన్‌లు మంచి స్నేహితులు. కిశోర్‌కుమార్ హైదరాబాద్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేసి గోదావరిఖనికి వచ్చాడు. అక్కడ పని చేస్తున్న శ్రీనివాస్, నిరంజన్‌కు పరిచయమయ్యాడు. ఈ ముగ్గురు తాగుడుకు, జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసేందుకు పూనుకున్నారు. గజ్వేల్, హుజురాబాద్, జగిత్యాల, సుబేదారి పోలీసు స్టేషన్‌ల పరిధిలో 2015 సంవత్సరంలో 15 దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారు. ఈ యేడాది వరంగల్ పోలీసు కమిషనరెట్ పరిధిలో 10 చోరీలకు పాల్పడ్డారు. కమిషనరెట్ పరిధిలో 5, మిల్స్‌కాలనీ 2, జనగామ 2, ఖానాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక దొంగతనాలకు పాల్పడ్డారు. అంతేకాకుండా నల్లగొండ జిల్లాలో మూడు దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ముగ్గురు ఇటీవల కమిషనరెట్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, జఫర్‌ఘడ్, ఉప్పుగల్లు గ్రామాల్లో మరో మూడు దొంగతనాలకు పాల్పడ్డారు. కాగా వీరు దొంగిలించిన బంగారం, వెండి ఇరత వస్తువులను అమ్మేందుకు వరంగల్ జ్యూవెల్లరి మార్కెట్‌కు వచ్చారు. సీసీఎస్ పోలీసులకు పక్కా సమాచారం రావడంతో ముగ్గురిని పట్టుకున్నట్టు వెల్లడించారు. వీరి నుంచి 156 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి వస్తువులతో పాటు ఒక ల్యాప్‌టాప్, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వారిలో సీసీఎస్ సీఐ డేవిడ్‌రాజ్, ఎస్సై సుబ్రహ్మణ్యం, సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న పెద్ది

నెక్కొండ: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బొల్లబోయిన పరుశురాములుకు రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పరుశురాములుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు గత సంవత్సరం అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నారని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మౌనికకు రూ.55వేలు, ప్రవళికకు రూ. 5వేలు, వంశీకి రూ.40వేల చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గటిక అజయ్‌కుమార్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యురాలు నుస్రత్ తన్వీర్, వైస్ ఎంపీపీ దొనికెన సారంగపాణి, నాయకులు మారం రాము, కృష్ణారావు, విశ్వనాథం, అజయ్, శ్రీకాంత్, రాజు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు హరితహారంలో పాల్గొననున్న స్పీకర్

శాయంపేట: మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో గురువారం నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పాల్గొంటారని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్ బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుడి మృతి



గీసుగొండ: మొగిలిచర్ల గ్రామానికి చెందిన మండ సాంబయ్య(98) బుధవారం మృతిచెందాడు. స్వాతంత్ర పోరాటంలోను, రజకార్లకు వ్యతిరేకంగా సాంబయ్య పోరాటం చేశాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

'పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ ఇస్మాయిల్

పరకాల: గణేష్ నిమజ్జనం, బక్రీద్, బతుకమ్మ, దసరా పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ ఇస్మాయిల్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణ వాసులతో పండుగలపై సమావేశాన్ని నిర్వహించారు. ఇస్మాయిల్ మాట్లాడుతూ ముందస్తు సమాచారం అందిస్తే పండుగలను శాంతియుతంగా చేసుకోవడం కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సుధీంద్ర, సీఐ జాన్‌నర్సింహులు, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, సర్వర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న సమయంలో నిమజ్జనం చేయాలి..

వినాయక నిమజ్జనాన్ని రాత్రివేళలో కాకుండా మధ్యాహ్న సమయంలోనే నిర్వహించాలని పరకాల ఏసీపీ వైవీఎస్ సుధీంద్ర అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణగార్డెన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులకు విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీంద్ర మాట్లాడుతూ ఒకరికి ఒకరు సహకరిస్తూ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ జాన్‌నర్సింహులు, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, రాజేశ్వర్, రాజభద్రయ్య, విద్యాసాగర్, సభ్యులు పాల్గొన్నారు.

మినీ లోకం



'పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి'

దామెర: మానవ మనుగడకు ఆధారమైన పర్యావరణ సమతుల్యతకు విరివిగా మొక్కలు నాటాలని తహసీల్దార్ బి.సరిత కోరారు. బుధవారం మండలంలోని పసరుగొండ గ్రామంలోని శ్మశానవాటిక స్థలం ఆవరణలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో షఫీ అహ్మద్, సంజీవ, ఆనంద్‌కుమార్, లింగమూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా కిరణ్

నర్సంపేట టౌన్ : నర్సంపేట పట్టణానికి చెందిన ఎనబోతుల కిరణ్‌ను బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చిర్ల కిరణ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. విద్యారంగ సమస్యలపై చేసిన కృషిని గుర్తించి ఈ పదవినిచ్చామని తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దారపు రమేష్

చెన్నారావుపేట: రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దారపు రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు వ్యవసాయక కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా. రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాదాబైనామా, భూసర్వేలు. రైతు కమిటీల పేరుతో కాలం వెళ్లదీస్తుందన్నారు. రైతులను గుర్తింపు కార్మికులుగా గుర్తించే, జీవో నెంబర్ 282ను అమలులోనికి తీసుకరావలన్నారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రంను తహసీల్దార్ సుభాషిణికి అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సభ్యుడు నమిండ్ల స్వామి, కౌలు రైతు నాయకులు పెరమాండ్ల రఘుపతి, భూపాల్‌రెడ్డి, సోమ్లా, ధనరాజ్, యాకుబ్, పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

నేటితో ముగియనున్న పంటల బీమా గడువు

ఖానాపురం : ప్రదానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకంలో పంటలకు బీమా చేసుకునే గడువు నేటితో ముగియనుందని ఏఈవో శ్యాం బుధవారం తెలిపారు. పంట రుణాలు పొందిన రైతులు తప్పని సరిగా పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాక్షర భారత్ సమ్మెనోటీస్

ఖానాపురం : సాక్షరభారత్ సమన్వయ కర్తల సమ్మెలో భాగంగా బుధవారం ఎంపీపీ రవీందర్‌రావు, ఎంపీడీవో శంకరికి వినతిపత్రం అందజేశారు. మండల కోఆర్డినేటర్ రాజతులసీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాడు ఇంటి పన్నులు.. నేడు నీటి పన్ను..

- ప్రజలపై భారం మోపేందుకు రంగం సిద్ధం
- నేటి కౌన్సిల్ సమావేశంలో నీటి పన్నుల పెంపుపై జరగనున్న చర్చ
- గృహాలపై రూ.40 నుంచి 100, కమర్షియల్‌పై రూ.100 నుంచి 150 పెరగనున్న నీటిపన్ను



నర్సంపేట నగర పంచాయతీ కార్యాలయం

నర్సంపేట: నర్సంపేట పట్టణ ప్రజలపై రెండేళ్ల క్రితం ఇంటి పన్నుల భారాన్ని మోపిన నగరపంచాయతీ అధికారులు తాజాగా నీటి(నల్లా)పన్ను భారాన్ని మోపేందుకు రంగం సిద్ధం చేశారు. నగరపంచాయతీ పరిధిలోని 20వార్డుల్లో 4వేల 350 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 4 వేల నల్లా కనెక్షన్లు గృహాల్లో ఉండగా మరో 350 కమర్షియల్ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఈ నల్లా ద్వారా నీటి పన్ను నగరపంచాయతీకి ఏటా 18 లక్షల వరకు ఆదాయం వస్తుంది. నీటి సరఫరా కోసం, విద్యుత్ బిల్లుల చెల్లింపు, నీటిసరఫరా పరికరాల కొనుగోలు కోసం ఏటా రూ: 55 లక్షల ఖర్చు వస్తుంది. దీంతో నీటి సరఫరా విషయంలో ఏర్పడుతున్న భారాన్ని కొంత మేరకు తగ్గించుకోవాలన్న ఉద్దేశ్యంతో పట్టణ ప్రజలపై నీటి పన్ను భారాన్ని మోపాలన్న నిర్ణయానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చారు. గతంలో గృహస్థులకు నెలకు రూ.40 విధించే నీటి పన్నును రూ.100కు, కమర్షియల్ యజమానులను రూ.100 నుంచి రూ.150కి పెంచుతూ ప్రదిపాదనలను సిద్ధం చేశారు. పన్నుల పెంపు ఆమోదం పొందితే నగరపంచాయతీకి అదనంగా రూ.15లక్షల ఆదాయం సమకూరనుంది.

నేడు నగరపంచాయతీలో జరిగే కౌన్సిల్ సమావేశంలో నీటిపన్నులు పెంచేందుకు అవసరమైన తీర్మాణంపై చర్చించనున్నారు. పెరిగిన ఇంటి పన్నుల భారాన్ని మోస్తున్న ప్రజలపై నీటి పన్నుల భారం మోపే తీర్మాణంపై అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగే అవకాశాశం ఉంది. మూడేళ్లుగా పట్టణ ప్రజలకు పాలకవర్గం కులాయిల ద్వారా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయడంలో చూపని శ్రద్ధ పన్నులు పెంచేందుకు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి వ్యతిరేకతను చవి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే కులాయిల ద్వారా వచ్చేనీటిని ఇంటి అవసరాలకు వినియోగిస్తూ తాగేందుకు ఒక్కో కుటుంబం రెండు నుంచి మూడు మినరల్ వాటర్ క్యాన్ల కొనుగోలు కోసం రోజు 30 నుంచి 45 రూపాయలు వెచ్చిస్తున్నారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు ఇన్నాళ్లు నిర్ణయం తీసుకోని నగరపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు నీటిపన్నులను పెంచేందుకు నిర్ణయం తీసుకునేందుకు సన్నాహాలు చేశారు. గతంలో కొనసాగిన చైర్మన్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే ఇంటి పన్నులను పెంచారు. ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ నాగెల్లి వెంకట నారాయణగౌడ్ అధ్యక్షతన నీటి పన్నులను పెంచే తీర్మాణాన్ని చర్చకు తీసుకువస్తున్నారు. పట్టణంలో 20 వార్డులకు 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో అధికార పార్టీకి చెందిన వారు 15 మంది ఉండగా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు 5గురు ఉన్నారు. నీటి పన్ను పెంపు విషయంలో కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదురకపోతే మెజార్టీ ఉన్న అధికార పార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపేది? లేనిది? నేటి కౌన్సిల్ సమావేశంలో తేలిపోనుంది.

డీఫ్లోరైడ్ ప్రాజెక్టు నీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేసేందుకు అవసరమైన పనులను చేపట్టేందుకు కలెక్టర్ రూ:40లక్షలను అందిస్తానని హామీ ఇచ్చినప్పటికీ అట్టి పనులను చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఆసక్తి చూపని అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై పట్టణంలోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

'సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి'



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసద్‌రెడ్డి

నర్సంపేట : కళాశాలలో జరిగే అవగాహన సదస్సులను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బిట్స్ చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్నెపల్లి శివారులో బిట్స్ కళాశాలలో ఇ2ఇ ఫ్రోలాస్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంతో కలిసి బుధవారం రీసెంట్ ట్రెండ్స్ ఇన్ రెయిన్‌ఫోర్స్‌డే కాంపోసిట్ మెటీరియల్స్‌పై జాతీయస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో వక్తలు చెప్పిన అంశాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కిట్స్ ప్రొఫెసర్ కొమురయ్య, రిసోర్స్ పర్సన్ అనిల్, కళాశాల ఏవో సురేష్, లింగయ్య, యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన డ్రెయినేజీ నిర్మాణ పనులు



పనుల్లో పాల్గొన్న కూలీలు

నర్సంపేట : పట్టణంలోని 12వ వార్డులో 'కందకం తీశారు..డ్రైనేజీ నిర్మాణం మరిచారు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో మంగళవారం ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. బుధవారం ఉదయం 12వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి జెండా గద్దె వరకు డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. నెల రోజులుగా వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ కథనాన్ని ప్రచురించడంతో నగర పంచాయతీ చైర్మన్ నాగెల్లి వెంకట్‌నారాయణగౌడ్, కమిషనర్ మల్లిఖార్జునస్వామి వెంటనే పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం పనులను ప్రారంభించారు. దీంతో 12వ వార్డు ప్రజల ఇక్కట్లు తొలగిపోనున్నాయి.

గణపతి వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానం



గణపతికి పూజలు నిర్వహిస్తున్న జ్ఞాన్‌సాగర్‌గౌడ్ దంపతులు

నర్సంపేట : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు కొంకీస జ్ఞాన్‌సాగర్‌గౌడ్ దంపతులు గణపతికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు రామకృష్ణశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంకీస విఘ్నేష్‌గౌడ్, దుస్స కుమారస్వామి, కొంకీస మదన్, పవన్, బయ్య యశ్వంత్, అంకాల నవీన్, గొస్కుల సందీప్, సంగెపు శ్రీనివాస్, కూచన రవి, గణేష్ పాల్గొన్నారు.

పెద్ది సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిక

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లి-రాంపూర్ గ్రామాల్లో టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో న ర్సంపేటలో బుధవారం టీఆర్ఎస్‌లో చేరారు. తక్కెళ్లపెల్లి మోహన్‌రావు, మాజీ ఎంపీటిసీ పోశాలు, రవి, అజ్మీర చందర్, సుధాకర్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక సాయం

దుగ్గొండి : మండలంలోని పొనకల్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన ఏరుబటి వినయ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామానికి చెందిన ఆరె సంఘం సభ్యులు రూ.13650 ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబానికి చెదిన వినయ్‌ని ఆదుకోవాలని బాలవికాస సంస్థ ప్రతినిధి రాజ్‌కుమార్ వేడుకోగా ఆస్పత్రి ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో బుసారి బాబురావు, ఆగాజీ, మోహన్‌రావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి, నోటు పుస్తకాల పంపిణీ

నర్సంపేట టౌన్ : మండలంలోని ఇటుకాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీఆర్ఎస్ మహిళా విభాగం వరంగల్ అధ్యక్షురాలు కసుమ కవిత బుధవారం నోటుపుస్తకాలు, క్రీడా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో చదివే పేద విద్యార్థిని శివాణికి రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సారయ్య, విద్యార్థి సంఘం నాయకులు ఈ.రాజు, గణేష్, రాకేష్, శివ, నవీన్, గోనె రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ హాస్టళ్ల ప్రారంభం

నెక్కొండ : మండలంలో మంజూరైన గిరిజన పోస్టు మెట్రిక్ హాస్టళ్లను బుధవారం ఎంపీపీ అజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులోని గ్రోమోర్‌పై అంతస్తులో బాలికల హాస్టల్, కేసముద్రం రోడ్డులో బాలుర హాస్టల్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బక్కి కవితఅశోక్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యురాలు నుస్రత్‌తన్వీర్, ఎంపీటీసీ దానివాగ్యానాయక్, సర్పంచ్ విక్టోరియా, డీటీడీవో నిర్మలాదేవి, హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

'నీటి పన్ను పెంచే ప్రతిపాదనను విరమించుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న లావుడ్య రాజు

నర్సంపేట : నీటి పన్ను పెంచే ప్రతిపాదనను నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు విరమించుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి లావుడ్య రాజు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇంటి పన్నులు పెంచి భారం మోపిన నగర పంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులు తాజాగా నీటి పన్నులను పెంచి ప్రజలపై భారం మోపాలని చూస్తున్నారన్నారు. ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కట్టయ్య, నర్సింహస్వామి, ప్రదీప్, బోగిపాణి, అడ్డూరి రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఉపాధి ఎక్స్‌గ్రేషియా చెక్కు పంపిణీ

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో ప్రమాదవశాత్తు బావి పైకప్పుకూలీ మృతిచెందిన బయ్య రమేష్ కుటుంబసభ్యులకు బుధవారం జడ్పీ వైస్‌చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, ఎంపీపీ భానోతు సారంగపాణి ఉపాధిహామీ పథకం ఎక్స్‌గ్రేషియా రూ.50వేల చెక్కును అందచేశారు. ఆరు నెలల క్రితం జాతీయ ఉపాధిహామీ పథకంలో మంజూరైన వ్యవసాయ బావిని తవ్వుతుండగా మట్టిపెళ్లలుపడి రమేష్ మృతి చెందాడు. చెక్కును రమేష్ భార్య రేణుక, తల్లిదండ్రులు బుచ్చమ్మ, పెద్దఅయిలయ్యకు అందించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో మూర్తిరెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, సర్పంచ్ మంగ్యానాయక్, ఎంపీటిసీ సూరయ్య, ఉపసర్పంచ్ రవిందర్ పాల్గొన్నారు.

కట్ర్యాలలో బోర్‌వెల్ సీజ్

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల లో ప్రభుత్వ భూమిలో రైతు వేసిన బోరును మంగళవారం తహసీల్దార్ కనకయ్య, ఎంఆ ర్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మోటారు, పైపులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

టీఎస్ఎఫ్ మండల అధ్యక్షుడి ఎన్నిక

చెన్నారావుపేట : తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ మండ లాధ్యక్షుడిగా బానోతు దయాకర్ బుధవారం ఎన్నికైనట్లు జిల్లా అధ్య క్షుడు తడికొప్పుల మల్లేష్ తెలిపారు. విద్యార్థి విభాగంలో చురుకైనా పాత్ర పోషిస్తున్నందున దయాకర్‌కు పదవి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే పరిశ్రమల ఏర్పాటు

✦ నియోజకవర్గంలో 100 చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు ✦ సివిల్ సప్లయీస్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేటలో గణపతికి పూజలు చేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు ఆర్థికంగా బలపడడానికి జిల్లాలో ప్రప్రథమంగా నర్సంపేట నియోజకవర్గంలో వంద చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏ ర్పాటు చేయడానికి సన్నహాలు చేస్తున్నట్లు సి విల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుద ర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించడానికి మంగ ళవారం కలెక్టర్‌తో సమావేశం నిర్వహించా మన్నారు. నర్సంపేట ఆర్అండ్‌బీ అతిథి గృ హంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ నర్సంపేట నగ రపంచాయతీగా ఏర్పాటైన అనంతరం జా తీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వర్తిం చకుండా పోయిందన్నారు. ఈ ప్రాంత మహి ళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెగా ఫుడ్ ప్రాజెక్టు ఏర్పాటు అయ్యేలోపే ఏడాది కాలంలో నర్సంపేటలో 100 కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. ఈ 100 చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో రూ.10లక్షల విలువ చేసే 50పరిశ్రమలు, రూ.25లక్షలు విలువ చేసే 50చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్నారు. కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చే మహిళలు కమిటీలుగా ఏర్పడాలన్నారు. నర్సంపేటలో పట్టణ సమాఖ్య సభ్యులు గ్రూపుగా ఏర్పడి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకో వాలన్నారు. అలాగే మండలాల్లోని గ్రామైఖ్య సంఘాల సభ్యులు గ్రూపులుగా ఏర్పడి పరిశ్ర మలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలన్నారు. పసుపు, పప్పు, కారం, బిస్కెట్స్, చాక్లెట్స్, కలర్‌ల్యాబ్, లేజర్ ప్రింటింగ్, టైల రింగ్, అప్‌సెట్ ప్రింటింగ్, బనియన్స్, కర్ర పరిశ్రమ తదితర 100రకాల చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నా యన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రభుత్వ పరంగా పరిశ్రమల ఏర్పాటుకు నిధులు మంజూరవుతాయన్నారు. ఈ అవకా శాలన్ని పట్టణ, మండల గ్రామైఖ్య సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో నగరపంచాయతీ చైర్మన్ నాగెల్లి వెంక ట్‌నారాయణగౌడ్, రాష్ట్ర డైరెక్టర్ సంగూలాల్, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు పెండెం వెంకటేశ్వర్లు, బండి ప్రవీణ్, మండల శ్రీనివాస్, నర్సయ్య గౌడ్, సాంబయ్య, రమేష్ పాల్గొన్నారు.

గణపతికి పూజలు.. అన్నదానం..

పట్టణంలోని 19వ వార్డులో గణపతి మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పెద్ది సుదర్శన్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

'పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలి'

చెన్నారావుపేట : పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని సాక్షర భార త్ కోర్డినేటర్‌లు బుధవారం ఎంపీడీవో లక్ష్మీప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మండలాధ్యక్షుడు కందిక సునిల్ మాట్లాడుతూ గౌరవ వేతనం రూ.15000 లు చెల్లించా లన్నారు. సాక్షర భారత్ కోఆర్డినేటర్‌లను రెగ్యూలరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేం దర్, బాబుగౌడ్, కవిత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తిలో...

రాయపర్తి : సాక్షరభారతి కోఆర్డినేటర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చే స్తూ 1నుంచి సమ్మె చేస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ పూస మధు ఆధ్వర్యంలో సమ్మె నోటీసును తహసీల్దార్ రాంమూర్తికి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20నెలలుగా వేతనాలు లేకుండా వెట్టిచాకిరి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో పూర్ణచం దర్, వెంకటా చారి, జ్యోతి, గిరి, పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు

దుగ్గొండి : మండలంలోని గోపాల పురంలో బుధవారం మరుగుదొడ్ల నిర్మా ణానికి ఎంపీడీవో భాస్కర్ శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు మరుగుదొడ్లి నిర్మించుకొని వందశాతం పారిశుధ్యంకై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజేందర్, ఈవోపీ ఆర్డీ ఖాజామైనొద్దీన్, ఏపీఎం రాజ్‌కుమార్, ఎఫ్ఏ పాల్గొన్నారు.

'రీ సర్వేచేపట్టి అర్హులను ఎంపిక చేస్తాం'



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజిని

ఖానాపురం : డబుల్ బెడ్ రూంల కోసం అర్హులను ఎంపిక చేయడా నికి మరోసారి రీ సర్వే చేపట్టి గ్రామ సభల్లో అర్హులను ఎంపిక చేయను న్నట్లు తహసీ ల్దార్ రజిని తెలిపారు. బుధ వారం అశోక్‌నగర్‌లో సర్పంచ్ ముంజాల సాయిలు అధ్యక్షతన డబుల్‌బెడ్‌రూంల కోసం అర్హు లను ఎంపిక చేయడానికి గ్రామసభ నిర్వహించారు. తొలుత 24మంది లబ్ధిదారుల పేర్లను గ్రామ సభలో వెల్లడించినప్పటికీ అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని అభ్యంతరాలను వ్యక్తం చేస్తు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రజిని మాట్లాడుతూ గ్రామసభలో ఎంపిక చేసిన వారిని రద్దు చేస్తూ మరోసారి గ్రామంలో రీ సర్వే చేసి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌రావు, ఉపసర్పంచ్ యాదగిరిరావు, ఎంఆ ర్ఐ నవీన్, వీఆర్వోలు సామల అశోక్, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశీలించిన అధికారులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న షార్పుద్దీన్

చెన్నారావుపేట: మండలంలోని జీజీఆర్ పల్లెలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను మహ బుబాబాద్ జిల్లా టీం లీడర్ షార్పుద్దీన్ బుధ వారం పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణ పనుల చాలా బాగున్నా యన్నారు. ఈ కార్యక్ర మంలోఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న, అసిస్టెంట్ టీం లీడర్ శివప్రసాద్ స్వచ్ఛ భారత్ జిల్లా కన్సల్టెంట్ అధికారి శ్రీనివాస్, సర్పంచ్ మిట్టపల్లి రమా, కార్యదర్శి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాయపర్తి మండల సర్వసభ్య సమావేశం

రాయపర్తి : రాయపర్తి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు(శుక్ర వారం) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోజె స్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావే శానికి ఎంపీపీ గుగులోతు విజయ నామ నాయక్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరు కావాలన్నారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన వివరాలతో హాజరు కావాలని, వివిధ అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పర్వతగిరి : ఈజీఎస్ పనులపై మండలకేంద్రంలో నేడు సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఇటీవల గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ తనిఖీల వివరాలను ప్రజావేదికలో వెల్లడిస్తామ న్నారు. గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, ప్రజలు హాజరుకావాలని సూచించారు.

ఆత్మహత్యకు యత్నించిన కుటుంబం

కాజీపేట : భూతగదాలతో అలసిపోయి ఓ కుటుంబం బుధవారం కాజీపేట వడ్డెపల్లి చెరు వులోపడి ఆత్మహత్యకు యత్నించింది. కాజీపేట ఎస్సై బీమేశ్ వివరాల ప్రకారం నల్లబెల్లి మండలం ముచ్చింపుల శివారు దస్తగిరిపల్లెకు చెందిన రేణుకుంట్ల ఐలయ్య కొంత కాలంగా కాజీపేట దర్గాలో కుటుంబంతో సహా కిరాయికి ఉంటున్నాడు. ఇతనికి గ్రామంలో ఉన్న భూవి వాదంలో కుటుంబీకులతో విసిగిపోయి కుటుంబంతో సహా బుధవారం వడ్డెపల్లి చెరువులో పడి ఆత్మహత్యకు యత్నించాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడి కౌన్సెలింగ్ చేసి పంపించారు.

గోపా ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి

చెన్నారావుపేట : మండల కేంద్రంలో గోపా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల రాజుగౌడ్, మండల గోపా అధ్యక్షుడు ఓదయ్యగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, న్యాయవాది సాంబయ్యగౌడ్, మల్లయ్య, ఏవో హరిప్రసాద్‌గౌడ్, ఏఈఓ సతీష్ గౌడ్, ఎంపీటీసీ బాబుగౌడ్, వెంకన్నగౌడ్, యాకయ్య, రాజుగౌడ్, కార్తీక్‌గౌడ్, డీలర్ రాజుగౌడ్ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయుల సామూహిక సెలవు



కొండాపురం హెచ్ఎం లింగారెడ్డికి సెలవు పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

రాయపర్తి : మండలంలోని కొండాపురం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నూతన పె న్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చే స్తూ ఉపాధ్యాయులు సామూహికంగా సెలవు లు పత్రాలను హెచ్ఎం లింగారెడ్డి, కొమ్ము ర వీందర్‌కు అందించారు. ఈసందర్భంగా టీపీ టీఎఫ్ కార్యదర్శి కిన్నెర శ్రీనివాస్ మాట్లాడు తూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్ష న్ విధానాన్ని అమలు చేయాలని సెప్టెంబర్ 1నుంచి సామూహిక సెలవులో ఉంటామన్నా రు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి కుమార్, ప్రభాకర్, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో...

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎంహెచ్ఈయూ రాష్ట్ర కమిటీ చైర్మన్ పొట్ట బత్తిని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధ వారం మండలకేంద్రంలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వ హించ తలపెట్టిన సామూహిక సెలవులకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఉద్యోగులంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయ వంతం చేయాలన్నారు. 1న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి వరంగల్ డిసిహె చ్ఎస్‌కు వినతిపత్రం అందించాలన్నారు.

పేదలకు అండగా ఉంటాం

పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

దామెర: సమాజంలోని నిరుపేదలకు అండగా ఉంటామని పరకాల నియోజ కవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన ముఖ్యనేత ఇజ్జిగిరి రవీందర్ తండ్రి కొమురయ్య అనారోగ్యం కారణంగా ఇటీవల అకాల మృతి చెందారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వెంకటాపూర్ గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుక ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లేతాకుల సంజీవరెడ్డి, సీనియర్ నేత కొసనం సత్యనారాయణ, గీసుగొండ మండలం ఆరెపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, బాబూరావు, మండల, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పెన్షన్ విద్రోహదిన పోస్టర్ ఆవిష్కరణ



నల్లబెల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నల్లబెల్లి: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం పాటించాలని కోరుతూ తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగ అసోసియేట్ (టిసీపీఎస్‌ఈఏ) ప్రచురించిన పోస్టర్లను జడ్పీ వైస్‌చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.మూర్తిరెడ్డి, ఎంఈవో మాలోతు దేవా, ఎన్.మహేందర్, ఎస్.రాజేందర్, ఎన్.రాజశేఖర్, కందుల గోవర్ధన్, పి.మల్లయ్య, జె.సుభాస్, భిక్షపతి, యు.రాజేందర్, రాము, అబిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో ..

దుగ్గొండి: మండలంలోని మహ్మదాపురం పాఠశాలలోని ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొనాలని రాష్ట్ర ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింహచారి, కృష్ణ, విష్ణువర్ధన్‌రావు, వల్లిదేవసేనా, చక్రధర్, సబిత పాల్గొన్నారు.

❖ మార్కెట్ ధరలు ❖

బియ్యం (100 కిలోలు)	కనిష్ట	గరిష్ట
విజయమసూరి కొత్తవి	4000	4300
దొడ్డుబియ్యం	1900	2500
పప్పులు క్వింటాల్‌కు		
కంది పప్పు	4900	6000
పెసరపప్పు	5800	6800
మైసూర్‌పప్పు	4900	5500
శనిగపప్పు	6000	7300
చక్కెర	1920	2100
ఉల్లిగడ్డలు	800	900
మిర్చి		
తేజ	2000	5000
వండర్‌హాట్	1200	3200
మిర్చి (తాలు)	500	1100
పసుపు (కాడి)	6000	7000

సినిమాలు

● **పరకాల**

జయ డీలక్స్ : జయ జానకీ నాయక
కాకతీయ : లై
నటరాజ్ : నక్షత్రం

● **నర్సంపేట**

రాంరాజ్: : నేనే రాజు నేనే మంత్రి
జయశ్రీ : ఫిదా
అరవింద : జయ జానకీ నాయక

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్‌ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కేయూకు మంచి భవిష్యత్ ఉంది..

● న్యాక్ బృందం చైర్మన్ ఎన్‌సీ గౌతం ● ఆసక్తికరంగా ఎగ్జిట్ సమావేశం



ఎగ్జిట్ సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ బృందం చైర్మన్ ఎన్‌సీ గౌతం

కేయూ క్యాంపస్(కాళోజీ జంక్షన్) : కాకతీయ విశ్వవిద్యాలయానికి మంచి భవిష్యత్ ఉందని, అయితే లోపాలను సరిదిద్దుకుంటూ దూసుకుపోవాలని న్యాక్ బృందం చైర్మన్, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మహాత్మాగాంధీ చిత్రకూట్ గ్రామోద్యయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఎన్‌సీ గౌతం చెప్పారు. కేయూలో గత రెండు రోజులుగా సేకరించిన సమాచారాన్ని న్యాక్ బృందం సభ్యులు మూడవ రోజు నివేదిక రూపంలో డ్రాఫ్టింగ్ చేశారు. అనంతరం సాయంత్రం సెనెట్ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ సాయన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎగ్జిట్ సమావేశంలో గౌతం మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతంలో ఉన్న కేయూ ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నదని ప్రశంసించారు. లోపాలు సర్వసాధారణమే అయినప్పటికీ వాటిని అధిగమించాలనికోరారు. మూడు రోజుల పాటు యూనివర్సిటీలో అన్ని విభాగాలను పరిశీలించి నివేదికను రూపొందించామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వంటి సంస్థల నుంచి విరివిగా నిధులు ఇచ్చే దిశలో రికమెండేషన్ చేశామని చెప్పారు. నివేదిక ప్రతిని వీసీ ఆర్. సాయన్నకు అందజేశారు. న్యాక్ బృందం సభ్యులు కన్హయ్య అహుజ, ఏవీ సింగ్ మద్నావత్, హెచ్‌పీ పాంపడే, సంజీవ్‌పురి, వైకేగుప్తా సభ్యులుగా, కన్వీనర్‌గా గౌతం సన్యాల్ వేదిక మీద కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.పురుషోత్తం, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేయూలో ముగిసిన న్యాక్ బృందం పర్యటన

● హాస్టల్ వసతుల్లో తప్ప అన్నింటిలోనూ భేష్ ● 'ఎ' ప్లస్ గ్రేడ్ దక్కుతుందని వర్సిటీ అధికారుల నమ్మకం

కేయూ క్యాంపస్(కాళోజీ జంక్షన్) : కాకతీయ యూనివర్సిటీలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం పర్యటన బుధవారం ముగిసింది. బృందం కన్వీనర్ ఎన్‌సీ గౌతం నేతృత్వంలో ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వర్సిటీలోని వివిధ విభాగాలను పరిశీలించారు. బృందంలో కన్హయ్య అహుజ, ఏవీసింగ్ మద్నావత్, హెచ్‌పీ పాంపడే, సంజీవ్‌పురి, వైకేగుప్తా సభ్యులుగా ఉన్నారు. వీరు క్యాంపస్‌లోని అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రగతి, సౌకర్యాలపై ఆరా తీశారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. కాగా, క్యాంపస్‌లో అధ్యాపకులకు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై న్యాక్ బృందం సంతృప్తి వ్యక్తపర్చినట్టు సమాచారం. అయితే యూనివర్సిటీలో విద్యార్థులకు సంబంధించి రెండు అంశాలపై న్యాక్ అధికారులు పెదవి విరిచినట్లు తెలిసింది. హాస్టళ్లలో సరిపడా వసతులు లేకుండా ఇంతమంది విద్యార్థులను ఎలా కేటాయించారని ప్రశ్నించినట్టు తెలి సింది. అలాగే క్రీడా విభాగంలో మూమెంట్ రిజిస్టర్‌పై ఆరా తీసినట్టు తెలిసింది.



న్యాక్ రిపోర్టును వీసీ సాయన్నకు అందజేస్తున్న ఎన్‌సీ గౌతం, ఇతర బాధ్యులు

చిన్న స్థాయి లోపాలున్నప్పటికీ కేయూ న్యాక్ 'ఎ' ప్లస్ గ్రేడ్ సాధిస్తుందని వర్సిటీ అధికారులు భరోసా వ్యక్తం చేస్తున్నారు. అత్యున్నత గ్రేడ్ సాధించినట్లయితే వర్సిటీకి పెద్ద మొత్తంలో యూజీసీ, రూసా, ఇతర ఏజెన్సీల నుంచి నిధులు అందుతాయి. ఒక సారి గ్రేడ్ వస్తే అది ఆరేళ్ల పాటు కొనసాగుతుంది.

ఖాళీ అధ్యాపకులే సమస్య..

కేయూలో ప్రతి డిపార్టుమెంట్‌లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అధ్యాపకుల వివరాలను కమిటీ తన నివేదికలో పొందుపర్చింది. గ్రేడ్ ఇవ్వడంలో అధ్యాపకుల సంఖ్యను కుడా బేరీజు వేయనున్నారు.

వర్సిటీలో కొంతకాలంగా నియామకాలు లేకపోవడం వల్ల విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకులు లేరని తెలింది. నెల రోజుల్లో కేయూకు ఏ స్థాయి గ్రేడ్ వస్తుందో తెలియనుంది.



భూపాలపల్లిలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గణనాథుడికి 101 రకాల ప్రసాదాలను భక్తులు నైవేద్యంగా సమర్పించారు. - ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి

బొగత వద్ద 'సరోవరం' సినిమా షూటింగ్

వాజేడు(జయశంకర్ జిల్లా) : తెలంగాణ నయాగార అయిన మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద రోజు రోజుకూ సినిమా షూటింగ్‌ల సందడి పెరిగిపోతోంది. బుధవారం శ్రీలత సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సరోవరం చిత్రంలోని ఓ పాటను జలపాతం వద్ద నటీనటులపై చిత్రీకరించారు. ఇప్పటికే 90శాతం నిర్మాణం పూర్తయిన ఈ సినిమాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు యడవల్లి సురేష్ తెలిపారు. ఈ చిత్రంలో ఛత్రపతి ఫేం శేఖర్ ఒక కీలకమైన రోల్ చేస్తున్నట్లు తెలిపారు. సరోవరం అనే గ్రామంలో జరిగిన యదార్థ సంఘటనను ఆధారంగా తీసుకుని సినిమా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, గౌతమ్‌రాజ్, ఫణి, ముఖ్యనటులు నటిస్తుండగా సంగీతం సుమన్‌కశ్యప్, నృత్య దర్శకురాలిగా ప్రేమలత, నిర్మాతగా శ్రీలత వ్యవహరిస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద సినిమాల షూటింగ్ ఇక్కడే నిర్వహించే అవకాశాలు ఉన్నాయని చిత్రబృందం భావించింది. జలపాతం వద్దకు ఛత్రపతి ఫేం శేఖర్ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న అభిమానులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.



జలపాతం వద్ద సినిమా చిత్రీకరణ దృశ్యం

'ములుగు అరణ్యం విప్లవోద్యమానికి కేంద్ర బిందువు'



సభలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా

ములుగు(జయశంకర్ జిల్లా) : గోదావరి పరీవాహక ప్రాంతానికి 1969లో చంద్ర పుల్లారెడ్డి రాకతో ములుగు ప్రాంత అరణ్యం విప్లవోద్యమానికి కేంద్ర బిందువుగా మారిందని, ఆయన నిర్మించిన పోరాటం నేటికీ ఆచరణీయమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా అన్నారు. చంద్ర పుల్లారెడ్డి శతజయంతి సభ ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్స్‌లో బుధవారం పార్టీ డివిజన్ కార్యదర్శి నున్న అప్పారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న టాన్యా మాట్లాడుతూ 1968లో ఆంధ్రా విప్లవకారుల సమన్వయ కమిటీ పిలుపు మేరకు ములుగు అటవీ ప్రాంతానికి వచ్చిన పుల్లారెడ్డి వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయకుండా ఛత్తీస్‌ఘడ్ ప్రాంతం వరకు కలియదిరిగి ఉద్యమాన్ని నిర్మించారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, నాయకులు రాజన్న, రాజేందర్, కృష్ణ, దయాకర్, ప్రతాప్‌రెడ్డి, టి.రాజు, తిరుపతి, సారంగం, సమ్మయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

కేంద్రం మెడలు వంచైనా పాత పెన్షన్‌ను సాధించుకుంటాం

● టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ● ఎంజీఎం కూడలి నుంచి కలెక్టరేట్ కీర్తి స్థూపం వరకు భారీ ర్యాలీ

సుబేదారి : కేంద్రం మెడలు వంచైనా పాత పెన్షన్ విధానాన్ని సాధించుకుంటామని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సెంటర్ నుంచి హన్మకొండ సుబేదారిలోని కలెక్టరేట్ ముందు ఉన్న అమరుల కీర్తి స్థూపం వరకు 2 వేల మందితో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జేఏసీ జిల్లా అధ్యక్షుడు పరిటాల సుబ్బారావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కీర్తి స్థూపం ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో కారం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను పోరాడి సాధించుకున్న మాదిరిగానే సీపీఎస్‌ను రద్దుచేసే వరకు ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. సీపీఎస్ అంతమే మా పంతం అన్నారు. ఉద్యోగుల మెడపై కత్తి వేలాడుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఉద్యోగులు పోరుబాట పట్టారన్నారు. ఇప్పటికే వివిధసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు టీఎన్జీవోస్ యూనియన్ పెద్ద పాత్ర పోషిస్తుందన్నారు. అదేవిధంగా ఉద్యోగుల సమస్యల సాధనకు యూనియన్ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి సీపీఎస్ రద్దు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు కోలా రాజేష్‌కుమార్‌గౌడ్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, జనరల్ సెక్రెటరీ రత్నవీరాచారి, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, సిటీ అధ్యక్షుడు రాంకిషన్, పుల్లూరు వేణుగోపాల్, ఫసలోద్దీన్, రాంనాయక్, సోమయ్య, నర్సింగ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు నగరంలో ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.

కేటీపీపీలో రెండో రోజూ కొనసాగిన రిలే దీక్షలు



చెల్పూర్‌లోని కేటీపీపీ ఎదుట చేపట్టిన రిలే దీక్షల్లో కూర్చున్న రాష్ట్ర నాయకులు

గణపురం(జయశంకర్ జిల్లా) : కేటీపీపీలోని ఇంజనీర్ల డిమాండ్‌ను ప్రభుత్వం నెరవేర్చకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు.గణపురం మండలం చెల్పూర్‌లోని కేటీపీపీలో తెలంగాణస్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయా అసోసియేషన్ల నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో విధుల్లోకి తీసుకోవద్దన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, సంతోష్, నరేష్, రామకృష్ణ, చంద్రశేఖర్, సుజిత్, తిరుపతి దీక్షలో కూర్చోగా కేటీపీపీ ఇంజనీర్లు సంఘీభావం తెలిపారు.

భట్టి వ్యాఖ్యలు పెద్ద జోక్

● కాంగ్రెస్‌లో మిగిలిన నేతలను కాపాడుకునే ప్రయత్నం ● టీఆర్‌ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రావు

హన్మకొండ టౌన్ : టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క వ్యాఖ్యలు దశాబ్ద కాలంలోనే పెద్ద జోక్ అని టీఆర్‌ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. హన్మకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌ను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్‌లో మిగిలిన నేతలు గోడ దూకకుండా భట్టి విక్రమార్క ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతల్లో ఐఖ్యత, సరైన నాయకత్వం లేదని, అటువంటి పార్టీలోకి ఇతర పార్టీల వారు వస్తారని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నేతలు పార్టీ మారకుండా కాపాడుకునేందుకు టీఆర్‌ఎస్‌లో గందరగోళంసృష్టించే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. 45సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో నిర్వీర్యం చేసిందని రవీందర్‌రావు విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రావు

ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ పొంతలేని ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తుందని దుయ్యబట్టారు. దోచుకోవడం.. దాచుకోవడం కాంగ్రెస్ నైజమని ధ్వజమెత్తారు. రికార్డులను పకడ్బంధీ చేయడానికి, భూ సమస్యలు పరిష్కరించేందుకు భూ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని రవీందర్‌రావు తెలిపారు. పార్టీ రైతు విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతు సమన్వయ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్, టీడీపీ విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో కర్షక పరిషత్‌లు, కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ కమిటీలు వేసిన విషయం మరువరాదని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు జన్ను జఖార్య, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, ఎడవెల్లి కృష్ణారెడ్డి, కోల జనార్ధన్, కత్తరపల్లి దామోదర్, చిర్రరాజు, లలితా యాదవ్, హరి రమాదేవి, పద్మ, రహీమున్నీస తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

చర్లలో బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు- మృతులు సూరవీడు వాసులు



ఎదిరగుట్టల మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన శివ, లక్ష్మణ్‌రావు

వెంకటాపురం(నూగూరు)(జయశంకర్ జిల్లా) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండల పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో మండలంలోని సూరవీడుకు చెందిన టెక్యం శివ(26),ముక్కర లక్ష్మణ్‌రావు (48) అక్కడికక్కడే మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటాపురం నుంచి భద్రాచలంవైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని ఎదిరగుట్టల మూలమలుపు వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో చర్ల గ్రామం నుంచి వెంకటాపురం వైపునకు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వెంకటాపురం మండలం సూరవీడు గ్రామానికి చెందిన టెక్యం శివ, ముక్కర లక్ష్మణ్‌రావు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. కాగా, శివకు భార్య, రెండేళ్ల కుమార్తె, లక్ష్మణ్‌రావుకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తె ఉన్నారు. దీంతో సూరవీడు గ్రామంలోని ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతర కృషి

● వచ్చే నెల 16, 17 తేదీల్లో గ్రామీణ జర్నలిస్టులకు శిక్షణ ● మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

సుబేదారి (హన్మకొండ) : మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర మీడియా అకాడమీచైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సెప్టెంబర్ 16, 17 తేదీల్లో హన్మకొండలోని నందనగార్డెన్స్‌లో గ్రామీణ జర్నలిస్టులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం, హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో అల్లం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి రూ.60కోట్ల నిధులు ఉన్నాయని, ఈ నిధి రూ.100కోట్లకు చేరితే ప్రతి జర్నలిస్టుకు పెన్షన్ సౌకర్యం అందేలా కృషి చేస్తానన్నారు.

హెల్త్‌కార్డుల జారీప్రక్రియ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతుందని అల్లం నారాయణ తెలిపారు. జర్నలిస్టులందరి దీర్ఘకాలిక సమస్య అయిన ఇళ్లస్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయంలో త్వరలోనే ప్రకటన వెలువడుతుందన్నారు. ఇచ్చినమాట ప్రకారం డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇచ్చామన్నారు. ఇళ్లస్థలాల విషయంలో వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అక్రిడేషన్లు లేని జర్నలిస్టులందరికి హెల్త్‌కార్డులు ఇస్తామన్నారు. పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అల్లం నారాయణ

టీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుంటిపెల్లి వెంకట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మారుతిసాగర్,ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, బీఆర్. లెనిన్, రాష్ట్ర నేతలు పిన్నా శివకుమార్, పీవీ కొండల్‌రావు, ఎస్.శంకర్‌రావు, ఎన్ఎస్.రావు, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తడక రాజనారాయణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి దుంపల పవన్, జిల్లా కోశాధికారి వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణిత్‌తేజ్‌కు విజయవంతంగా శస్త్ర చికిత్స

బ్లూలైన్ ఆస్పత్రి వర్గాలకు రూ.80వేల చెక్కు అందజేత

రాష్ట్ర శిశు సంక్షేమ డైరెక్టర్‌కు మూడో రోజు నివేదిక

ఆస్పత్రిలోనే పర్యవేక్షిస్తున్న జిల్లా శిశు సంక్షేమాధికారి

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా) : దంతాలపల్లి మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల ఎస్సీ కాలనీ రెండో అంగన్‌వాడీ సెంటర్‌లో ఈ నెల 28వ తేదీన వేడి పాల గిన్నెలో పడి తీవ్రంగా గాయపడిన ప్రణిత్‌తేజ్‌కు బుధవారం హన్మకొండలోని బ్లూలైన్ ఆస్పత్రి వైద్యులు కొలాజన్ శస్త్ర చికిత్స చేశారు. ప్రణిత్‌తేజ్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఆడుతున్న క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తీవ్రగాయాలపాలైన విషయం తెలిసిందే. బాలుడికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్రబోయి స్పందించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన ఘటనపై బాధ్యులను తొలగించేందుకు ఆదేశాలుజారీ చేస్తూ మెరుగైన వైద్యం కోసం ఎంతైనా ఖర్చును భరిస్తామని ప్రకటించడంతో మంగళవారం నుంచి ప్రణిత్‌తేజ్‌కు బ్లూలైన్ ఆస్పత్రిలో వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. బుధవారం నిర్వహించిన కొలాజన్ శస్త్రచికిత్స కోసం వైద్యులు ముందస్తుగా డిపాజిట్ కోరడంతో రూ.80వేల చెక్కును అందించినట్టు మహబూబాబాద్ జిల్లా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లేనినా, ఉమ్మడి జిల్లా ఆర్జేడీ రాములు, సీడీపీవో శిరీషలు తెలిపారు.

బాలుడి ఆరోగ్యంపై సమీక్షిస్తున్న అధికారులు

ప్రణిత్‌తేజ్ ఆరోగ్యంపై 24 గంటల పాటు సంబంధిత శిశు సంక్షేమ శాక అధికారులు ఆస్పత్రిలో ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లేనినా, ఉమ్మడి జిల్లా ఆర్జేడీ రాములు, మహబూబాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ చింతల భారతిరెడ్డి, వరంగల్ జిల్లా ఆర్గనైజర్ కమరున్నీసాబేగం, సీడీపీవో శిరీష, జిల్లా బాలల రక్షణ అధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.



ఆస్పత్రిలో ప్రణిత్‌తేజ్‌తో మాట్లాడుతూన్న ఆర్జేడీ రాములు, లెనినా

డయల్ యువర్ డిపో మేనేజర్‌కు స్పందన

పరకాల: పరకాల బస్‌డిపో సమస్యలపై డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించగా మంచి స్పందన లభించింది. ఫోన్ ద్వారా ఆర్టీసీ అభివృద్ధిపై సూచనలు ఇవ్వడంతో పాటు పరకాల నుంచి హైదరాబాద్‌కు సూపర్‌లక్సరీ బస్సు ఏర్పాటు చేయాలని అలాగే పరకాల నుంచి పులుకుర్తి, లాదెల్ల మీదుగా హన్మకొండకు బస్సు రూట్ కల్పించాలని, బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉన్నాయని, ప్రయాణికులకు కనీసం ఫ్యాన్‌ల సౌకర్యం లేదని, పరకాల నుంచి జమ్మికుంటకు మల్రెడ్డిపెల్లిగూడెం, నార్లాపురం మీదుగా బస్సు కొనసాగించాలని ప్రయాణికులు కోరారని పరకాల బస్‌డిపో మేనేజర్ సుగుణాకర్ తెలిపారు.

అభివృద్ధి పనులను చేపట్టాలని కౌన్సిలర్ల ఆందోళన



ప్లకార్డులు చూపిస్తూ మౌనపోరాటం చేస్తున్న కౌన్సిలర్ కొయ్యడ మల్లికాంబ

పరకాల: నగరపంచాయతీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కౌన్సిలర్లు ఆందోళన చేశారు. బుధవారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా కౌన్సిలర్లు మడికొండ సంపత్ బొచ్చు దిలీప్, పోరండ్ల సంతోష్, ఆర్‌పి. జయంత్‌లాల్, మాట్లాడుతూ పట్టణంలోని వీధుల్లో కనీసం వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నిసార్లు చెప్పినా కౌన్సిల్ సమావేశంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారని అన్నారు. కౌన్సిల్ తీర్మానం లేకుండానే నూతనంగా నలుగురు వ్యక్తులను సిబ్బందిగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన లెక్కలు చెప్పాలన్నారు. అలాగే కౌన్సిలర్ కొయ్యడ మల్లికాంబ మాట్లాడుతూ పట్టణంలోని మల్లారెడ్డిపల్లి వీధిలో భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తూ సీసీరోడ్డు తొలగించగా దాని స్థానంలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం కోసం చైర్మన్ రాజభద్రయ్య శంకుస్థాపన చేసి ఆరు నెలలు గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించ లేదంటూ నోటికి గుడ్డకట్టుకొని ప్లకార్డులతో మౌనపోరాటం చేశారు. సమావేశం మధ్యలో నుంచి చైర్మన్ రాజభద్రయ్య వెళ్లిపోయాడు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం, సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు రూ. 13లక్షలను కేటాయించామని ఈ నిధులతో వీధిలైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనకు నగర పంచాయతీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎలాంటి తప్పు చేసినా తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే అధికారం కౌన్సిలర్లకు ఉందని, తప్పు చేస్తే ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేశ్వర్, ఏఈ బాలక్రిష్ణ, కౌన్సిలర్లు బండారి కవిత,దశరథం,వేణు, దేవేందర్‌లు పాల్గొన్నారు.

'ఓపెన్ పాఠశాలను వినియోగించుకోవాలి'

పరకాల: ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు ఓపెన్‌పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ బుధవారం ఓ ప్రకటనలో అన్నారు. 16సంవత్సరాలు నిండి మధ్యలో చదువు మానేసినవారు ఓపెన్‌పాఠశాల ద్వారా ఇంటర్ పూర్తి చేసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 4నుంచి 17వరకు అడ్మిషన్లు తీసుకోబడుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

నేడు ఫొటో స్టూడియోల బంద్

పరకాల: నూతన రేట్లను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఫొటోగ్రాఫర్లు గురువారం ఫొటో స్టూడియోల బంద్‌ను నిర్వహిస్తున్నామని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెరిగిన ముడి సరుకుల ధరల వల్ల చాలీచాలని జీవనోపాధితో ఇబ్బందులు పడుతున్నామని నూతన ధరలు అమలుచేయాలని దానికి కస్టమర్లు,శ్రేయోభిలాషులు సహకరించాలని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కోరారు.

ఉచిత అన్నదాన కార్యక్రమం

పరకాల: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. యూత్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పోరండ్ల రమేష్ వాణి, కుమారస్వామి స్వప్న, కిరణ్ లక్ష్మీ, రమేష్ పద్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్‌పి జయంత్‌లాల్, ఖాసీం, అజయ్, రాజేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

'దానాల్లో అన్నదానం గొప్పది'

సంగెం: దానాల్లో అన్నదానం మహా గొప్పదన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని రిటైర్డ్ డీయస్‌వో వేలూరి రాజశేఖర్ చెప్పారు. బుధవారం మండలంలోని గవిచర్ల గ్రామంలో బుద్దె ప్రనూష-శ్రీకాంత్ దంపతులు గణపతి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమంలో ఎంపీటీసీ దొనికెలశ్రీనివాస్,కర్ణాకర్,యాకయ్య,రాజు, కళింగం, బోళ్లకుమార్, కృష్ణప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు



గవిచర్లలో అన్నదానం చేస్తున్న రాజశేఖర్

'విమోచన దినాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి'



మాట్లాడుతున్న విజయచందర్‌రెడ్డి

సంగెం: తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు మొలుగూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం పోరాటం చేసి చనిపోయిన వారిని స్మరించుకోవాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సెప్టెంబర్ 2న చేపట్టబోయే పరకాల కేంద్ర పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో పార్టీకి చెందిన జిల్లా ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, చంద్రమౌళి,రాజుగౌడ్, నరేశ్‌శర్మ, అచ్చరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

శాయంపేట: ఉపాధ్యాయులు పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో పున్నం యాదవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో బుధవారం స్వచ్ఛ పఖ్వాడపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1నుంచి 15 వరకు నిర్వహించబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు రమేష్‌బాబు, రాజిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శశికళాదేవి, సీఆర్‌పీలు నిర్మల, అశోక్, శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలని వినతిపత్రం

గీసుగొండ: సాక్షరభారత్‌లో పనిచేస్తున్న మండల, గ్రామ కో ఆర్డినేటర్‌ల వేతనాలను పెంచి ఉద్యోగభద్రత కల్పించాలని సాక్షరాభారత్ కో ఆర్డినేటర్‌ల సంఘం నాయకులు బుధవారం వయోజనవిద్య ఉపసంచాలకుడు, జడ్పీ డిప్యూటీ సీఈవో అనిల్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎంసీవో వేల్పుల సురేష్‌యాదవ్, వీసీవోలు సత్యం, కుమారస్వామి, రాజు, క్రాంతి, జహీర్, శ్రీదేవి, రవి, లత, సరిత, రజిత, శ్రీనివాస్, సారిబాబు, పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల మాస్‌లీవ్

గీసుగొండ: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించేందుకు మండల విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌లు మాస్‌లీవ్ కోసం తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా కార్యదర్శి కూనమల్ల రమేష్, మండల అధ్యక్షుడు సదయ్య, నాగరాజు, ఏకాంబ్రం, అక్రం, మైనొద్దీన్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సివిల్ ఆస్పత్రిలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పరకాల: పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. వచ్చిన మందుల స్టాక్ సరఫరా చేసిన వివరాలు, రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. సంబం ధిత అధికారులను క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో సివిల్ ఆస్పత్రికి సంబంధించి వ్యవహారాలపై జడ్పీటీసీ పాడి కల్పనాదేవి వైద్యాధికారులకు ఫిర్యాదు చేయగా విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. అందులో భాగంగా బుధవారం పరకాల సివిల్ ఆస్పత్రిని తనిఖీ చేశామని విజిలెన్స్ సీఐ అమృతరెడ్డి, ఎస్సై పులి రమేష్ తెలిపారు.

గట్లకానిపర్తిలో గ్రామసభ

శాయంపేట: మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో బుధవారం డబుల్‌బెడ్ రూం లబ్ధిదారుల ఎంపికకు తహసీల్దార్ వెంకటభాస్కర్ గ్రామ సభను నిర్వహించారు. 60 మంది లబ్ధిదారుల జాబితాను తయారు చేయగా, కొంత మందిపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. మరికొంత మంది దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరగా సుమారుగా 150 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేసి మరో వారం రోజుల్లో తిరిగి గ్రామసభను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వైనాల విజయ, ఎంపీటీసీ బొమ్మకంటి సుజాత, ఆర్‌ఐ హేమానాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలల్లో యోగా విద్య

గీసుగొండ: జిల్లాలోని 12 కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో యోగా విద్యను నేర్పబోతున్నామని ఎస్‌ఎస్‌ఏ జిల్లా సెక్టోరియల్ అధికారి సంధ్యారాణి తెలిపారు. కస్తూర్బా బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీ, ఏఎన్‌ఎం, మాడల్ స్కూల్‌లో పనిచేస్తున్న కేర్ టేకర్‌లకు రెండు రోజులపాటు ఇచ్చే యోగా శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం వంచనగిరి కస్తూర్బా పాఠశాల్లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా విద్య వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రతతోపాటు మానసిక వికాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమం జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుజన్‌తేజ, యోగా గురువు డాక్టర్ అమృతవల్లి, ఎస్‌వో హిమబిందు, సీఆర్‌టీలు అనిత, ఉషా,లీన, శోభ, రజిని, సరస్వతి, స్వప్న, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

నేడు కస్తూర్బాను సందర్శించనున్న జేసీ..

మండలంలోని వంచనగిరిలో గల కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ హరిత సందర్శించనున్నారు. యోగా శిక్షణ శిబిరాన్ని ఆమె పరిశీలించనున్నారు.

పాఠశాలలో స్వచ్ఛభారత్

శాయంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వల్పదాసి వెంకటరమణ, వైస్‌చైర్మన్ శ్రీలత పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

అధికారుల నిర్లక్ష్యమే 'ఆసరా'గా కొందరు అనర్హులూ ప్రతినెలా ఠంచనుగా పింఛను అందుకుంటున్నారు. పేరు, వయసు, స్థానికత ఇలా ఎన్నెన్నో తప్పుడు వివరాలను సమర్పించి కొందరు పెన్షన్ డబ్బులు తీసుకుంటున్నారు. ఇంకొందరు కాలం చేసిన తమ పెద్దల పేరిట ప్రతినెలా నిర్భయంగా పింఛను మొత్తం అందుకొంటున్నట్లు తెలుస్తోంది. పండుటాకులకు చేయూతగా నిలిచే ఆసరా పథకానికి బూజులా పట్టుకున్న వ్యవహారాల సంగతి తేల్చాల్సిన అధికారగణం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న వైనంపై కథనమిది.



అనర్హులకు ఆసరా!

జిల్లాలవారీగా పింఛన్‌దారులు	
వరంగల్ అర్బన్	1,09,860
జనగామ	79,062
జయశంకర్	89619
మహబూబాబాద్	1,01,928
వరంగల్ రూరల్	95403

- అర్హతలు లేనివారూ ఆసరా పింఛన్లు అందుకుంటున్న వైనం
- అనర్హులు, చనిపోయిన పెన్షన్‌దారుల గుర్తింపులో వైఫల్యం
- మూడు నెలలకోసారి క్షేత్రస్థాయి పరిశీలనలు జరగని వైనం
- అమలుకు నోచుకోని జీవో నంబర్ 17

కలెక్టరేట్(వరంగల్ అర్బన్ జిల్లా)

"ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రతీ మూడునెలలకు ఆసరా లబ్ధిదారుల స్థితిగతులపై క్షేత్రస్థాయి నుంచి వివరాలు సేకరించాలి.. అప్పుడే అర్హులకే పింఛన్లు అందుతాయి. చనిపోయిన పెన్షన్‌దారుల పేర్లు తొలగించేందుకు.. అనర్హులను గుర్తించేందుకు ఇదొక్కటే మార్గం" అని చెబుతోంది జీవో నెంబర్ 17. ఇది పచ్చినిజం. ఈ జీవో సూచించిన విధంగా అధికారులు నడుచుకుంటే అర్హులైన మరెంతో మంది కొత్తవారికి పింఛన్లు అందించేందుకు బాటలు పడతాయి. ఇదంతా జరగాలంటే చొరవచూపాల్సింది అధికారులే.

14 నెలలుగా పత్తాలేని తనిఖీలు..

2016 జూన్‌లో ఆసరా లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు సేకరించడం, లైవ్ సర్టిఫికెట్లు తీసుకోవడం ద్వారా వడపోత కార్యక్రమం జరిగింది. అప్పుడు సుమారు 65 వేల మందిని అనర్హులు, మరణించిన వారిగా గుర్తించారు. గత 14నెలలుగా ఆసరాపై ఎలాంటి తనిఖీలు నిర్వహించకపోవడంతో అనర్హులు, మరణించిన వారి సంఖ్య అధికంగానే ఉంటుందని డీఆర్‌డీవో అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వరంగల్ ఉమ్మడి జిల్లాలో డైరెక్ట్ బెనిఫీషియరీ ట్రాన్స్‌ఫర్(డీవోబి), పోస్టాఫీస్ ద్వారా ఆసరా పింఛన్ల పంపిణీ జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీసుల ద్వారా పంపిణీ జరుగుతుండగా గ్రేటర్ వరంగల్, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, పరకాల, మహబూబాబాద్ వంటి మున్సిపాలిటీల్లో డీవోబీ ద్వారా ఆసరా చెల్లింపులు జరుగుతున్నాయి.

చనిపోయిన వారి పేరిటా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,75,872మంది ఆసరా లబ్ధిదారులు ఉంటే ఇందులో 60శాతం మందికి లబ్ధిదారులు బ్యాంక్‌ల ద్వారానే ఆసరా డబ్బులు పొందుతున్నారు. ఇలా బ్యాంక్‌ల ద్వారా తీసుకుంటున్న లబ్ధిదారులు మరణించినప్పటికి ఏటీఎంల ద్వారా వారి కుటుంబ సభ్యులు ఆసరా పింఛన్లు తీసుకుంటున్నారని అధికారులు అంటున్నారు. ప్రతీ మూడు నెలలకు తనిఖీని నిర్వహించాలని తాము ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సూచిస్తున్నప్పటికి పట్టించుకోవడం లేదని డీఆర్‌డీవో అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత రెండు నెలలుగా దరఖాస్తు చేసుకున్న 559మంది ఆసరా లబ్ధిదారుల దరఖాస్తులపై తనిఖీలు నిర్వహించగా ఆరుగురు మరణించారని, 51మంది అనర్హులని విచారణ అధికారులు తేల్చారు. ఇలా ఆసరా పొందుతున్న వారిలో లేకపోరని అధికారులు భావిస్తున్నారు. ఆసరా ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, బీడి వర్కర్లు, ఒంటి మహిళలు, ఇతరులకు రూ. 1000 నుంచి రూ. 1500 వరకు ప్రభుత్వం అందిస్తోంది.

మూడు రకాల వారిని గుర్తించాలి..

గ్రామ స్థాయిలో కంటే పట్టణాల్లోనే ఎక్కువ అనర్హులు ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. డైరెక్ట్ బ్యాంక్ ద్వారా ఆసరా పింఛన్ పొందుతున్న వారు మొత్తం పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నారు. అధికారుల తనిఖీల్లో చనిపోయిన వారు, అనర్హులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారికి గుర్తించాల్సి ఉంటుంది.

పోస్టాఫీసుల ద్వారా పంపిణీ యోచన?

ఆసరాలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోస్టాఫీసుల ద్వారా ఆసరా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. పోస్టాఫీసుల ద్వారా ప్రసుత్తం గ్రామీణ ప్రాంతాల్లో ఆసరా పింఛన్ డబ్బుల పంపిణీ జరుగుతోంది. ఈ విధానంలో లబ్ధిదారులు వెళ్ళి వేలిముద్ర వేస్తే తప్ప పింఛన్ పొందలేరు. వరుసగా మూడు నెలల పాటు లబ్ధిదారులు పింఛన్ తీసుకోకుంటే దానికదే పింఛన్ తొలగిపోతోంది. ఇదే విధానం అన్ని చోట్ల అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి అనర్హులను గుర్తించి అర్హులకు 'ఆసరా' అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మేడారం నిధులకు జాగారం

- జాతర నిధుల మంజూరులో సర్కారు జాప్యం
- రెండు నెలల క్రితమే రూ.104.58కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు అందక అభివృద్ధి పనులు చేయించలేకపోతున్న వైనం
- శబరిమలై తరహాలో అభివృద్ధికి ప్రణాళికలు
- సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నా.. ఫలితం సున్నా

నిధుల ప్రతిపాదనలు(రూ.కోట్లలో..)		
శాఖ	వచ్చే జాతరకు	గత జాతరలో
రహదారులు, భవనాలు	28.70	28.10
ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్	24.08	21.75
పోలీసు శాఖ	13.42	4.57
నీటిపారుదల శాఖ	3.49	19.98
విద్యుత్ శాఖ	4.07	3.68
పంచాయతీరాజ్	4.00	12.15
రెవెన్యూ శాఖ	3.32	1.60
దేవాదాయ శాఖ	3.10	2.20
ఆర్టీసీ	2.48	1.92
జిల్లా పంచాయతీ శాఖ	2.40	12.15
వైద్య, ఆరోగ్య శాఖ	1.40	1.15
ఐటీడీఏ(గిరిజన సంక్షేమం)	0.30	2.90
ఇతర శాఖలు	9.82	----

ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి

శబరిమలై తరహాలో మేడారం జాతరలో శాశ్వ త అభివృద్ధి చేపడతామంటూ అధికారుల హడావుడి... శబరిమలై వెళ్లి అక్కడి ఏర్పాట్లను పరిశీలించి మేడారంలోనూ అమలు చేయాలని నిర్ణ యం... ఇక ఏడాది ముందు నుంచే జాతరలో అ భివృద్ధి పనులు చేపట్టి తమ మార్కు చూపించాలని మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం తహతహ... కానీ, పరిస్థితులు తిరగబడ్డాయి. ఏడాది నుంచి జాతర అభివృద్ధికి చేస్తున్న ప్రతిపాదనలు బుట్టదాఖలవుతున్నాయి. మొదట రూ.152కోట్లతో చేసిన ప్రతిపాదనలు తెరమరుగు కాగా, రెండు నెలల క్రితం సర్కారు ఆదేశాలతో రూ.104.58కోట్లతో చేసిన ప్రతిపాదనలు సూచనప్రాయంగా ప్రభుత్వం అంగీకరించినా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. వచ్చే ఏడాది జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతర జరగనుందని తెలిసినా.. నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం.

సమీక్షలు ఘనం.. నిధులు శూన్యం..

మేడారం జాతరకు ఈ ఏడాది 1.20కోట్ల భక్తులు వస్తారని అంచనాతో అధికారులు గత జనవరిలోనే ఏర్పాట్లకు సిద్ధమయ్యారు. జయశంకర్ జిల్లా జేసీ అమయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి నేతృత్వంలో ఓ బృందం శబరిమలైకు వెళ్లి, అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం చేస్తున్న ఏర్పాట్లపై అధ్యయనం చేసి, నివేదికను అందించింది. దాని ఆధారంగా వచ్చే జాతరకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. వీటిలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, రబ్బరు డ్యాంల ఏర్పాటు అనేది కీలక ప్రతిపాదనలు. గత జనవరి నుంచి ఈనెలదాకా జాతరపై దాదాపు 10 కిపైగా సమీక్ష సమావేశాలు చేపట్టారు. ప్రతీ బుధవారం జాతర అభివృద్ధిపై సమీక్షిస్తూనే ఉన్నారు. కానీ, నిధులు లేక సమీక్షలన్నీ వృథాగానే మిగులుతున్నాయి. గత మార్చి నెలలో రూ.152కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తే తిరస్కరణకు గురైంది. జూన్ 29న మరోసారి రూ.104.58కోట్లతో ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ. సింగ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చందూలాల్ సమక్షంలో హైదరాబాద్‌లో సమీక్షించి సూచనప్రాయంగా అంగీకరించారు. అయితే ఆ నిధులు ఇంకా మంజూరు కాలేదు.

అవగాహన లేమితో..

మేడారం జాతరపై జిల్లా అధికార యంత్రాంగంలో కీలక అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం కొంత మైనస్‌గా మారుతోంది. జేసీ అమయ్‌కుమార్ మినహా మిగతా ఉన్నతాధికారులు ఎవరికీ జాతరలో విధులు నిర్వహించిన పూర్వ అనుభవం పెద్దగా లేదు. దీంతో జాతరపై హడావుడి, ఆత్రుతలు తప్ప సరైన ప్రణాళికలు లేవనే విమర్శలున్నాయి. ఫలితంగానే జాతరకు ఏడాది ముందు నుంచే అంచనాలు.. సమీక్షలు, సమావేశాలు అంటూ సమయాన్ని వృథా చేశారనే విమర్శలు ఉన్నాయి.

రూ.2.72 కోట్లు అధికంగా..

ప్రభుత్వానికి జిల్లా అధికార యంత్రాంగం పంపిన ప్రతిపాదనలు పెద్దగా భారం పడేలా లేవు. 2016 జాతరకు ప్రభుత్వం రూ.101.86 కోట్లు మంజూరు చేయగా, ఈ సారి రూ.104.58 కోట్లు మంజూరు కోసం సూచనప్రాయంగా ఆమోదం తెలిపింది. అంటే కేవలం రూ.2.72కోట్లు మాత్రమే అదనపు నిధులు అందుతాయి.

ప్రతిపాదనల్లో హెచ్చుతగ్గులు..

గత జాతరలో పోలీసు శాఖకు రూ.4.57కోట్లు కేటాయిస్తే ఈ సారి రూ.13.42కోట్లు కేటాయించేలా ప్రతిపాదనలకు పంపారు. అలాగే క్రితం సారి నీటి సరఫరాశాఖ, పారిశుద్ధ్యానికి రూ.21.75కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.24.08కోట్లు ప్రతిపాదనలు పంపించారు. ఇలా అనేక శాఖలకు హెచ్చుతగ్గులతో గత జాతరతో సమానంగా నిధుల కోసం ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం దాదాపుగా ఆమోదించింది.



హన్మకొండ నందన గార్డెన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

'మిషన్ భగీరథ' పనులను గడువులోగా పూర్తి చేయాలి

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి • ఐదు జిల్లాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష

కలెక్టరేట్(వరంగల్ అర్బన్)/ వరంగల్ అర్బన్ అగ్రికల్చర్

కొత్త సంవత్సర కానుకగా ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాట నిజం చేయడానికి ఇంకా నాలుగు నెలల గడువు మాత్రమే ఉందని మిగిలి ఉందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్ట్ ఇది... మీరు కూడా అంతే ప్రతిష్ఠాత్మకంగా భావించి పనిచేయాలి..' అని సూచించారు.

హన్మకొండలోని నందన గార్డెన్స్‌లో వరంగల్ బుధవారం ఐదు జిల్లాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ, చేప పిల్లల పంపిణీ, రైతు సమన్వయ కమిటీలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ మిషన్ భగీరథను ఎవ్వరూ తేలికగా తీసుకోవద్దని, పనిలో అలసత్వం ప్రదర్శిస్తే నష్టపోయేది మన జిల్లానే అని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనవరి 1వ తేదీ నుంచి ప్రతీ ఆవాసానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5సెగ్మెంట్‌లలో పనులు జరుగుతున్నాయని, ఇవన్నీ డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథలో లక్ష్యాలను పూర్తి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమస్యలను గుర్తించి అవసరం ఉన్న చోట రీ షెడ్యూల్ చేసుకోవాలన్నారు. రైల్వే ట్రాక్‌ల వద్ద పైప్‌లైన్ వేయడం కోసం జాతీయ రహదారుల అనుమతితో పాటు ఇతర పనులు సరిచూసుకోవాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాలన్నారు.

వరంగల్ అర్బన్‌కు నీళ్ళు..

మిషన్ భగీరథ పనుల్లో వరంగల్ అర్బన్‌తో పాటు చుట్టుపక్కల మండలాలకు తాగునీరు అందించే ఎల్ అండ్ టి సెగ్మెంట్ పనులు నత్తనడకన సాగుతున్నాయని డిప్యూటీ సీఎం కడియం అన్నారు. అసలు వరంగల్ అర్బన్ జిల్లాకు నీళ్ళు ఇస్తామా.. లేదా అనేది అనుమానంగా ఉందని వెల్లడించారు. ఇక్కడ పైప్‌లైన్ వేయడంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయంతో లేకపోడంతో తీవ్ర సమస్య తలెత్తిందని తెలిపారు. వడ్డెపల్లి, నిట్, కాజీపేటలో కొన్ని సమస్యలు న్నాయని తెలిపారు. వర్కింగ్ ఏజెన్సీ పొంతన లేని లెక్కలు చెప్పడంతో డిప్యూటీ సీఎం అసహనం వ్యక్తం చేశారు. మీకు ఇంకా పైప్‌లైన్ మ్యానుఫాక్చరింగే అందుబాటులో లేదు పనులు ఎలా పూర్తిచేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో కలెక్టర్ కలుగచేసుకుని డిసెంబర్ నాటికల్లా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.





సమీక్షలో పాల్గొన్న రూరల్, మహబూబాబాద్, జయశంకర్ కలెక్టర్లు ప్రశాంత్ జీవన్‌పాటిల్, ప్రీతి మీనా, మురళి

రీ షెడ్యూల్ ఇవ్వండి...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పెద్దదైన మహబూబాబాద్ సెగ్మెంట్‌కు రీ షెడ్యూల్ ఇవ్వాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మహబూబాబాద్ సెగ్మెంట్‌కు రీ షెడ్యూల్ ఇవ్వాలని ఆదేశించారు.



సమావేశం జరుగుతుండగా ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి సరదా సంభాషణ

సమీక్షలతో సరిపెట్టవద్దు...

మిషన్ భగీరథ పనులు అనుకున్న గడువులోపు పూర్తి చేయాలంటే కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమీక్షలతో సరిపెట్టవద్దని డిప్యూటీ సీఎం అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్ళి పనులను పరిశీలించాలన్నారు. ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి పరిష్కార మార్గాలు వెతకాలన్నారు. కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు, వర్కింగ్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తిచేయాలని సూచించారు.

10లోపు చేప పిల్లలను వదలాలి...

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 50శాతం నిండిన చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలేసే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని డిప్యూటీ సీఎం అన్నారు. సెప్టెంబర్ 10వ తేదీలోపు చేప పిల్లలను చెరువుల్లో వదిలేయాలని సూచించారు. చేప పిల్లలు ఎదగడానికి కనీసం మూడు నెలల పాటు చెరువుల్లో నీళ్ళు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

రైతులకు పెట్టుబడి గొప్ప విషయం

రైతులకు ప్రభుత్వాలే పెట్టుబడి సమకూర్చడమనేది దేశంలోనే గొప్ప విషయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ పథకం సమర్థవంతంగా మలు చేయడం కోసం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ గ్రామాల్లో స్పష్టమైన టైటిల్ డీడ్ ఉన్న రైతుల వివరాలను సంబంధిత ప్రజా ప్రతినిధులకు అందజేయాలని సూచించారు.

సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గ్రామ, మండల రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు కమిటీ సభ్యులకు వారు తీసుకునే నిర్ణయాలపై అవగహన కల్పించాలన్నారు. 2018-19 సవత్సరంలో రైతులకు అందించే పెట్టబడికి ఈ కమిటీలో దోహద పడతాయన్నారు.

పనుల్లో అలసత్వం వీడాలి

మిషన్ భగీరథ పనుల్లో అధికారులు అలసత్వం వీడాలని, స్థానిక ప్రజా ప్రతినిదులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అదిగమించాలని ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్ భాస్కర్, కొండా సురేఖ, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆరూరి రమేశ్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, చల్లా ధర్మారెడ్డి అన్నారు. శిథిలావస్థలో ట్యాంక్‌లను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను అధిగమిస్తాం..



మిషన్ భగీరథ పనుల్లో నెలకొన్న సమస్యలను అధిగమిస్తాం. సంబంధిత ఏజెన్సీలతో సమావేశం ఏర్పాటు చేసి తగు ఆదేశాలిస్తాం. పలు చోట్ల పైప్‌లైన్‌ను జాతీయ రహదారులపై నుంచి వెళ్ళడంతో పనుల్లో జాప్యం ఏర్పడింది. చేప పిల్లల పెంపకం కోసం అన్ని చర్యలు చేపడతాం.

- అమ్రపాలి, అర్బన్ కలెక్టర్

అన్ని చర్యలు తీసుకుంటాం



జనగామ జిల్లా పరిధిలో 628 హ్యాబిటేషన్లకు గాను 578హాబిటేషన్లకు బల్క్ వాటర్ సప్లై చేశాం.22స్ట్రక్చర్స్ నిర్మాణం పూర్తి అయ్యాయి. 1409.88 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. రైతు సమన్వయ కమిటీలకు సంబంధించి 191 రెవెన్యూ గ్రామాల్లో 1బీ రికార్డులున్న 140621 రికార్డుల్లో 80శాతం సర్వే పూర్తి చేశాం.

- శ్రీదేవసేన, జనగామ కలెక్టర్

మిషన్ భగీరథ పనులు వేగవంతం చేస్తాం

- సురేందర్ రెడ్డి, మిషన్ భగీరథ చీఫ్

మిషన్ భగీరథ పనులు నెమ్మదిగా జరుగుతున్న చోట వేగవంతం చేస్తాం. సకాలంలో పూర్తిచేయడానికి సంబంధిత వర్క్ ఏజెన్సీలతో సమావేశ ఏర్పాటు చేసి తగు ఆదేశాలు ఇస్తాం. దీంతో పాటు పురాతన ట్యాంక్‌లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని సురేదర్ రెడ్డి అన్నారు. ప్రజలు తమ నల్లా కనెక్షన్లు ప్రహారి గోడ లోపే ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



హన్మకొండ నందన గార్డెన్‌లో జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

1. **'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)
2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)
3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)
4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)
5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా
6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్
7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'నంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్
8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజేరి
9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్



10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**
ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా
11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30
12. **ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ
13. **101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనంద సేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత
14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్
15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్
16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై
17. **ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి
18. **'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్
19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి
20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)
21. **రైల్వే బోర్డు నూతన చైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్థుతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహని
22. **ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు
23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి
24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)
25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)
26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ
27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్
28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్
29. **లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా
30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు
31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా



32. **స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?**
ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ
33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు
34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ
35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తముర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది
36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)
37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్
38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్
39. **'జార్'లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్
40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

		13) బి	20) ఎ	27) బి	34) బి
1) సి	7) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ
2) డి	8) డి	15) బి	22) బి	29) డి	36) డి
3) బి	9) ఎ	16) బి	23) బి	30) ఎ	37) సి
4) ఎ	10) బి	17) సి	24) ఎ	31) డి	38) బి
5) ఎ	11) బి	18) సి	25) బి	32) ఎ	39) డి
6) బి	12) డి	19) ఎ	26) డి	33) డి	40) బి

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 5
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆర్తోపెడిక్స్ 1)
కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు
అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న
వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం

2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్

3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్

4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం

5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్

6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్

7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ

8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపౌడర్ డి) ఏదీకాదు

9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు

10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం

11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2

12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్

13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్

14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్

15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ ఫెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్

16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ

17. ఆర్ధ్రతను కొలిచే పరికరం?
